

ఉన్నత చదువులు.. మంచి ఉద్యోగాలు.. ప్రేమకు ప్రతిరూపంగా ముద్దులొలికే బాలుడు. ఆ అందమైన కుటుంబాన్ని చూసి విధికి కన్ను కుట్టింది. రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. సాఫీగా సాగిపోతున్న వారి జీవితంలో అనుకోని ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వాళ్లు రాత్రంతా కారు ప్రయాణం చేశారు. మరో గంటలో గమ్యస్థానానికి చేరుకునేవారు. అంతలోనే రోడ్డు ప్రమాదం. ఐదుగురు మృతి చెందారు. సతీష్, అతని భార్య మీనాక్షి, కొడుకు రిత్విక్ కన్ను మూశారు. నాలుగేళ్ల ఈ చిన్నారి తండ్రి గుండెలపై నిద్రిస్తూ అటే కానరాని లోకాలకు వెళ్లిపోయారు. వెనుక సీట్లో ఉన్న మరో చిన్నారితో పాటు ఒకరు మృతి చెందారు. ఈ విషాద ఘటన ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు వద్ద శనివారం తెల్లవారుజామున చోటు చేసు కుంది. రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు.



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

మృత్యువాత పడ్డ ఐదుగురు కుటుంబ సభ్యులు

తెల్లారిన జీవితాలు

- కోటేకల్లు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- మలుపు వద్ద రెండు కార్లు ఢీ
- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు



- కన్నతండ్రి ఒడిలోనే శాశ్వతనిద్రలోకి బాలుడు
- అతివేగమే ప్రమాదానికి కారణం
- మంత్రాలయం శ్రీమఠానికి వెళ్తుండగా ఘటన
- మృతులంతా కర్ణాటక వాసులు



చిన్నారి రిత్విక్ మృత దేహాన్ని తీసుకు వస్తున్న దృశ్యం



సతీష్ (ఫైల్) మీనాక్షి వెంకటేశప్ప



రిత్విక్, బనిత్‌గౌడ్

ఎమ్మిగనూరు/ ఆదోని రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా మాలూరు తాలుకా నెల్లల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప, సరస్వతమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్దకుమారుడు సతీష్(34)కు ఎనిమిదేళ్ల క్రితం బంగారుపేట తాలుకా, చిక్కహోసల్లి గ్రామానికి చెందిన వెంకటేషప్ప(72), గంగమ్మల కుమార్తె మీనాక్షి(32)తో వివాహం జరిగింది. వీరిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా బెంగళూరులో స్థిరపడ్డారు. వీరికి రిత్విక్(4) కుమారుడు సంతానం. ఇటీవల సతీష్ బెంగళూరు పట్టణంలో ఓ ఇంటిని కొనుగోలు చేశాడు. 15రోజుల క్రితం సొంత గ్రామమైన నెల్లల్లికి చేరుకున్నారు. ఈనెల 27వ తేదీన వారు కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లి రోజును ఘనంగా జరుపుకున్నారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకోవాలనే మొక్కుబడిలో భాగంగా సతీష్ దంపతులు, అత్తమామలతో కలిసి మంత్రాలయం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి నెల్లల్లి గ్రామం నుంచి తన తమ్ముడు సుధాకర్ కారులో మిత్రుడు చేతన్ (డ్రైవర్)తో కలిసి రాత్రి 8గంటల సమయంలో అత్త మామ గ్రామమైన చిక్కహళ్లికి చేరుకున్నారు. అక్కడ అత్త, మామలు వెంకటేశప్ప, గంగమ్మ, వెంకటేశప్ప మనవడు బనిత్‌గౌడ్(5)ను ఎక్కించుకొని రాత్రి 10గంటల సమయంలో మంత్రాలయానికి బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న కేఏ07బీ 9672 నంబర్‌గల షిఫ్ట్ డిజైర్ కారు శనివారం తెల్లవారు జామున 4:20 గంటల సమయంలో ఆదోని మండలం ఆరెకల్లు, ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు మధ్యలో ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారిలో ఉన్న మలుపు వద్దకు చేరుకుంది.

మిగతా 7వ పేజీలో



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్



సంఘటనా స్థలంలో కార్లు, పరిశీలిస్తున్న అధికారులు



నుజ్జునుజ్జు అయిన కారును పరిశీలిస్తున్న ఏఎస్‌పీ, డీఎస్పీ



సంఘటనా స్థలంలో పంచనామా చేస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు



మృతుడు సతీష్‌ను కారులో నుంచి బయటకు తీసుకువస్తున్న అంబులెన్స్ డ్రైవర్లు

రూ.400 కోట్లతో వాటర్ గ్రిడ్

కలెక్టర్ రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డోన్ నియోజకవర్గ ప్రజల దాహం తీర్చేందుకు ప్రభుత్వం రూ.400 కోట్లతో వాటర్‌గ్రిడ్ పథకం చేపడుతున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శనివారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డితో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గానికి వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే బేతంచెర్ల మండలానికి నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే మార్చి నాటికి డోన్, ప్యాపిలి మండలాలకు ఇంటింటికి తాగునీరు అందిస్తామన్నారు. అలాగే జిల్లాలో 330 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులున్నాయని, అందులో 249 ట్యాంకులకు నీరు నింపామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలోని 30 చెరువులకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నీరు నింపామన్నారు. మరో 5 చెరువులకు కూడ త్వరలో నీరందిస్తామన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అంతకు ముందు మండలంలోని వెంగళాంపల్లి, గుడిపాడు, చంద్రపల్లి, హుసేనాపురం చెరువులను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావుయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీనివాసలు, ఖాజాపీర్, మోహూరి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డా.ఏ. సిరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

1100కు ఫోన్ చేయవచ్చు

దరఖాస్తుదారులు తమ సమస్య పరిష్కారం కాకున్నా, ఏ దశలో ఉందో తెలుసుకోవాలనుకున్నా కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే అర్జీదారులు ఖ్రుజూౌట్టర్యుఃఇఃజౌఠి.జీఃి వెబ్‌సైట్‌లో తమ అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా?

- మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి
- ప్రారంభం కాకుండానే ముగిసిన కౌన్సిల్ సమావేశం



నిరసన తెలుపుతున్న ఛైర్మన్, కౌన్సిలర్లు

నందికొట్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా అని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ప్రతి నెలా ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కమిషనర్ గైర్హాజరయ్యారంటూ సమావేశాన్ని ప్రారంభించకుండానే మున్సిపల్ ఛైర్మన్ సమావేశాన్ని ముగించారు. మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ముందు ఛైర్మన్, కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఛైర్మన్, కౌన్సిలర్లు హాజరయ్యా రు. మున్సిపల్ కార్యాలయంలోని అధికారులందరూ హాజరయ్యారు. కమిషనర్ బేబి కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్సులో ఉన్నందున సమయానికి హాజరు కాలేకపోయారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన తర్వాత సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లగా అప్పటికే ఛైర్మన్ సమావేశాన్ని వాయిదా వేసి తన ఛాంబర్‌కు వచ్చారు. కమిషనర్ ఛైర్మన్ ఛాంబర్‌కు వచ్చి వీడియో కాన్ఫరెన్స్ కారణంగా సమావేశానికి ఆలస్యమైందని సమావేశాన్ని ప్రారంభించాలని ఆమె కోరారు. అయితే ఛైర్మన్ స్పందిస్తూ ఒక సారి సమావేశాన్ని ముగించాక తిరిగి ప్రారంభించడం సరైన పద్ధతి కాదన్నారు.

పట్టణంలోని చెత్తతోనే దుర్వాసనగా ఉన్న పట్టణానికి ఆత్మకూరు డంప్ యార్డులోని చెత్తను ఎవరి అనుమతితో తరలించారని ఆయన కమిషనర్‌ను నిలదీశారు. సమావేశానికి కమీషనర్ గైర్హాజరు కావడంతో సీడీఎంఏ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని ఛైర్మన్ తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రికి కూడా ఫిర్యాదు చేస్తానని అన్నారు.

రాక్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటుకు ప్రణాళికలు

- కొండ చరియలను పరిశీలించిన అధికారులు



పరిశీలిస్తున్న అధికారులు

శ్రీశైలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అధునాతన టెక్నాలజీతో రాక్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. శనివారం ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఫారెస్టు రేంజర్ పరమేశులు, ఏపీ టూరిజం జీఎం పెంచల్‌రెడ్డి, పోలీసు ఇన్‌స్పెక్టర్లు ప్రసాదరావు, చంద్రబాబు శ్రీశైలం క్షేత్రానికి వచ్చే ఘాట్ రోడ్లను పరిశీలించారు. డ్యాంసైట్ నుంచి లింగాలఘాట్ వెళ్లే దారి, పాతాళగంగ రోప్ మార్గంలో వర్షాకాలంలో కొండచరియలు, బండరాళ్లు విరిగి పడుతున్నాయని వారు పేర్కొన్నారు. వాహనాల రాకపోకలకు, ప్రమాదాల బారి నుంచి యాత్రికులకు రక్షణ కల్పించే దిశగా రాక్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. నివేదికలు రూపొందించి కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

పోలీసు శాఖలో సేవలు అభినందనీయం

- పదవీ విరమణ పొందిన వారిని సన్మానించిన ఎస్పీ



పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖలో సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ సునీల్ షెరాన్ పేర్కొన్నారు. శనివారం పోలీసు కార్యాలయంలో జిల్లాలో పదవి విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఆయన సన్మా నించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..వీరి సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుందని అన్నారు. పదవీ విరమణ పొందిన వారు ఆరోగ్యంగా, కుటుంబంతో సంతోషంగా ఉండాలన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పిల్లల విషయాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఎలాంటి సాయం కావాలన్నా పోలీ సు శాఖ అన్ని విధాలా అదుకుంటుందన్నారు. కానిస్టేబుల్స్ ముకుం ద రెడ్డి, నాగేంద్రుడు పదవీ విరమణ పొందారు. డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ సీఐలు మంజునాథ్, సురేశ్‌బాబు పాల్గొన్నారు.

ఆర్డీవోపై తహసీల్దార్ అనుచిత వ్యాఖ్యలు

- వైరల్ అవుతున్న వీడియో

నందికొట్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతిపై నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నందికొట్కూరు మండలం కొణిదేలకి చెందిన విఘ్నేశ్వరస్వామి దేవాలయానికి దానం చేసిన భూమిపై కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఆలయ కమిటీ సభ్యులు తమ భూసమస్యను పరిష్కరించాలంటూ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఇచ్చిన సిఫార్సులను తహసీ ల్దార్‌కు ఇచ్చేందుకు ఆలయ కమిటీ సభ్యులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఆర్డీవో చెప్పినవిధంగా తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. తహసీల్దార్ అసభ్య పదజాలంతో దూషించినట్లు వీడియో వైరల్‌గా మారింది. ఈ అంశంపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా తన అధికారిపై అనుచితంగా అసభ్యకరంగా ఎలా మాట్లాడతామని ఆయన అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సమస్య పరిష్కారం కోసం రాగా అదే సమయంలో ఫోన్‌లో తన కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా ఆ సంభాషణను రికార్డు చేసి ఆర్డీవోను దూషించినట్లుగా చిత్రీకరిస్తూ వైరల్ చేశారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు తమకు అనుకూలంగా రిపోర్టు ఇవ్వడం లేదని తనపై లేనిపోని వీడియోలను సృష్టించి వైరల్ చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో వీడియోను వైరల్ చేసిన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అష్టాదశ శక్తిపీఠం ద్వాదశ జ్యోతిర్లింగమైన శ్రీశైలానికి పోటెత్తారు. శనివారం స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల నుండి వచ్చిన యాత్రికులతో క్షేత్ర వీధులు సందడిగా మారాయి. తెల్లవారుజామునే కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు మొక్కులుగా సమర్పించిన భక్తులు క్యూలైన్ల ద్వారా స్వామి అమ్మ వార్లను దర్శించుకుంటున్నారు. ఉభయ దేవాలయాలతో పాటు పరివార ఆలయాలు దర్శించుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పట్టింది. దేవస్థానం నిర్వహించే ఆర్జిత సేవలలో హోమాలు, కల్యాణాలు యథావిధిగా సాగాయి.

ఇట్లయితే ఎట్ల?

- మంత్రి నియోజకవర్గంలోనే అధ్వానంగా రోడ్లు
- మెడికల్ కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలి
- జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- అధికారులను ఛైర్మన్ ఇబ్బంది పెడుతున్నారని విమర్శలు
- వివాదాస్పదంగా ముగిసిన స్థాయీ సంఘ సమావేశాలు



సమావేశాలకు హాజరైన ఉమ్మడి జిల్లా జడ్పీటీసీలు, అధికారులు



మాట్లాడుతున్న ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ. జనార్దన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న బనగానపల్లె నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అక్కడే ఇలా ఉంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఏమిటని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. తాను జడ్పీటీసీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొలిమిగుండ్ల మండలంలో కూడా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఛైర్మన్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ మినీ సమావేశం భవనంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఛైర్మన్ అధ్యక్షత వహించగా సీఈవో జి. నాసరరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని అన్నారు. పీపీపీ విధానంలో కాకుండా ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కాలేజీలు నిర్వహిస్తే పేదలకు చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పథకాలను మండల కేంద్రాల్లో తెలియజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.


మిగతా 7వ పేజీలో

తుంగభద్ర తీరం

సాహిత్యం

పద్య కవిత్వంలో 'తోపు'

గాయపడిన సీమ గుండె గానం




వెంకటకృష్ణ కవిత్వం

కర్నూలు కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఓరుపును కల్లారా భరిస్తున్నది తల్లి/యిది ఎన్ని తరాల శాపమో.. అలనాడు అంగట్లో రతనాలు అమ్మిన సీమ, అడుగడుగునా నిండైన చెరువులు, నదులుల, వాగులు, వంకలతో కళకళలాడుతూ, పచ్చని పైరు పొలాలతో అలరారిన రాయలసీమ నేడు నీళ్లింకని రాళ్ల సీమగా మారింది. అలనాడు కోస్తా, ఉత్తరాంధ్ర జనులు పనిగట్టుకొని వలస వచ్చి ఇక్కడి పంట భూములను ఆశ్రయించిన దృశ్యం నేడు ఎలా తెరమరుగై పోయింది. ఇప్పుడు సీమవాసులు కోస్తాంధ్ర ప్రాంతానికి వలస పోయే హృదయ విదారక దృశ్యం నిత్యకృత్యమై పోయింది. ఇలా గాయపడిన సీమ గుండె గానాన్ని నిరంతరంగా వినిపిస్తూ, రాయలసీమ వాస్తవిక రూపాన్ని ఆవిష్కరిస్తున్న బాధ్యత కలిగిన కవి వెంకటకృష్ణ. 1990లో లోగొంతుక పేరుతో కవిత్వ సృజనకు శ్రీకారం చుట్టిన వెంకటకృష్ణ కలం సీమలోని కరువు, ఒరుపును భరించలేక రాసిన కవిత్వమే పైన పేర్కొన్న కవిత. 'ఓ సీమ తల్లి! ఈ ఒరుపును కల్లారా భరిస్తూ ఈ మూగ బాధను గుండెల నిండా ఎలా మోస్తున్నావమ్మా...' అంటూ సీమ తల్లి గుండె గొంతుకను బలంగా వినిపిస్తున్నాడు కవి. నాలుగు దశాబ్దాలుగా రాయలసీమలో రాజ్యమేలుతున్న కరుడు గట్టిన కరువు, కక్షలు, కార్పణ్యాలు వాటి వెనుక దాగిన పాలకుల కుట్రలు, కుతంత్రాలు, యువతలో నానాటికీ పెరిగిపోతున్న అసహనం, వీటన్నింటినీ తన కవిత్వంలోనికి ఒంపి, తన హృదయ వేదనను లోకానికి వ్యక్తీకరిస్తున్న వెంకటకృష్ణ ఐదు కవితా సంపుటాలను వెలువరించారు. లోగొంతుక, దున్నేకొద్దీ దుఃఖం, కొన్ని రంగులు ఒక పద్యం, చినుకు దీవి, కంచెదాటే పాట...అనే కవితా సంకలనాల నిండా సీమ బతుకులలోని విషాదంతో పాటూ ప్రస్తుతం మారిన భారత సమాజంలోని సంక్లిష్టతలను, సంఘర్షణలను తన కవిత్వ శరాలకు గుచ్చి బలంగా సంధించాడు వెంకటకృష్ణ. సీమ ఆవేదనను ఆయన తన కథల్లో, కవిత్వంలో చూపిస్తున్నాడు. అప్పుడు రాసుకున్న శ్రీబాగ్ ఒప్పందపు అక్షరాలు ఏమయ్యాయి...సీమ నాయకులకు పట్టని ఈ సీమతల్లి గోడును ప్రజలే దిక్కులు పిక్కటిల్లేలా అందరికీ వినిపించాలని కవి బలంగా కోరుకుంటున్నాడు. మాన్యం భూములను వదలని విషపు వలయం గురించి, కుట్రదారుల సన్నాగాల గురించి వెంకటకృష్ణ చాలా పదునుగా వర్ణించాడు. బీరప్ప కత్తి పట్టా అంచులో వున్న పదును నిద్రపోతోంది... అది ఎప్పుడు ఒకసారి నిద్ర నుండి మేలుకొని ఈ వ్యవస్థ పని పట్టబోతోందని కవి హెచ్చరించిన తీరు పాఠకులను జాగ్రత పరుస్తుంది. ఈ ఐదు సంకలనాలలోని పదునైన కవితలను ఏరికూర్చి 'వెంకటకృష్ణ కవిత్వం' పేరుతో వర్తమాన కవులు, విమర్శకులు వుప్పాల శ్రీరాం, అనిల్ డ్యానీ హోరు ప్రచురణలు పేరుతో 2025 జూలైలో ప్రచురించారు. ఈ అత్యంత ప్రభావితమైన కవిత్వానికి ఇటీవల వెంకటకృష్ణ 'అమృతలత జీవన సాఫల్య పురస్కారం' అందుకున్నారు.

● ఎస్ఎండీ ఇనాయతుల్లా, కథా రచయిత, కర్నూలు

పద్య కవిత్వంలో..



కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)


ఆయన జీవితం అందరిలా వడ్డించిన విస్తరిగా కాదు. హెచ్ఎస్ఎల్సీ పూర్తయ్యాక ఒకరిపై ఆధారపడకుండా స్వయంకృషితో పైకి వచ్చారు. యుక్త వయస్సులోనే జీవితాన్ని అర్థం చేసుకోవడంతో ఉద్యోగం వచ్చాక ఆ విలువలతోనే కొనసాగారు. ప్రస్తుత విశ్రాంత జీవితంలోనూ అదే ఆచరిస్తున్నాడు. ఇందతా ఆయన జీవిత నాణానికి ఒకవైపు అయితే...మరోవైపు ఆయన స్వతహాగా పద్య కవి. ఇప్పటికి నాలుగు పుస్తకాలు ప్రచురించారు. వచన కవిత్వం కూడా రాశారు. ఎందరో రచయితల ముద్రిత పుస్తకాలను చక్కని తన దస్తూరీతో తిరగరాసి, వారికి బహుమతిగా అందిస్తుంటారు. సాహితీ సభలకు, పుస్తక ముద్రణకు, సరస్వతీ దేవి విగ్రహాల స్థాపనకు ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు 12పైగా అష్టావధాన కార్యక్రమాలు నిర్వహించారు. డెబ్బయ్ ఏడేళ్ల ప్రాయంలోనూ సాహితీ, ఆధ్యాత్మిక సేవా ప్రస్థానం సాగిస్తున్నారు. ఆయనే జిల్లా సాహితీ చరిత్రలో చెరగని ఓ దస్తూరి.. వెంకట్రామ్ తొపుదుర్తి.

● చక్కని చేతి రాతతో రచయితల పుస్తకాల తిరగరాత
● సేవ.. దాతృత్వం వెంకట్రామ్‌కు రెండు కళ్లు
● డెబ్బయ్ ఏడేళ్ల వయసులోనూ సాహితీ సేవా ప్రస్థానం



బాల్యం నుంచి సాహిత్యాభిలాష...

కర్నూలుకు చెందిన కవి వెంకట్రామ్ తొపుదుర్తి 1949 ఆగస్టు 5న జన్మించారు. తల్లిదండ్రులు నాగలక్ష్మమ్మ, రామేశ్వరరావు దంపతులకు ముగ్గురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. ఆయన రెండో సంతానంగా జన్మించారు. తండ్రి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆనాడు బతకలేక బడిపంతులు అనే నానుడి ఆ కుటుంబానికి అక్షరాలా వర్తించింది. చాలీ చాలని వేతనంతోనే కుటుంబ పోషణ సాగింది. కర్నూలు మున్సిపల్ హైస్కూల్‌లో నాటి హెచ్ఎస్ఎల్సీ 1966లో ఉత్తీర్ణుడైన వెంకట్రామ్ అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఎల్ఈఈ సీటు లభించింది. అక్కడ అననుకూల వాతావరణంలో ఆయన చదువుకోలే పోయారు.



కుటుంబానికి ఆర్థికగా భారం కాకూడదని ఇంట్లోనే పాదరక్షలు తయారు చేసి అమ్మేవారు. తాను చదువుకున్న పాఠశాల ముందే కూరగాయలు పెట్టుకొని వ్యాపారం చేశారు. తీరిక సమయంలో చెక్క బొమ్మలు తయారు చేసేవారు. ఫొటో స్టూడియోలో డార్క్‌రూమ్‌లో ఫొటోలు ప్రింట్ చేసేవారు. తన జూనియర్లకు రికార్డులు, నోట్స్ రాసిపెట్టేవాడు. అలా స్వీయ సంపాదనతో డబ్బు విలువ బాగా తెలిసింది.



క్లస్టర్ యూనివర్సిటీ, కేవీఆర్ కళాశాల్లో తోపుదుర్తి నిర్మించిన చదువుల తల్లి విగ్రహ, మంటపాలు


మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం...

జిల్లా ఎంప్లాయ్‌మెంటు కార్యాలయం ద్వారా వెంకట్రామ్‌కు సిల్వర్ జూబ్లీ కళాశాల్లో ఎల్డీసీ (లోయర్ డివిజనల్ క్లర్క్)గా ఉద్యోగం వచ్చింది. 1974లో ఉద్యోగంలో చేరారు. అలా అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తూ, ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో కార్యాలయ సూపరింటెండెంట్‌గా 2007 జూలై 31న పదవీ విరమణ చేశారు. ఉద్యోగ జీవితం సాహిత్యరంగం వైపు ఆయన్ను అడుగులు వేయించింది. తెలుగు భాషపై ఉన్న మమకారంతో ఎక్కడ సభలు, సమావేశాలు జరిగినా హాజరయ్యేవారు. అలా ఆయనకు జిల్లా సాహితీవేత్తలతో సాన్నిహిత్యం పెరిగింది. స్వయంగా కథలు, కావ్యాలు రాయడం ప్రారంభించారు. అలా పద్య రచనలో మంచి పట్టు సాధించారు. ఆయన స్వయంగా ఖర్చు పెట్టి ప్రముఖ అవధానులను కర్నూలుకు ఆహ్వానించి వారితో 12 అష్టావధానాలు నిర్వహించారు. ఎందరో అవధానులకు ఆర్థిక సహాయం అందించారు. 1978లో రాజ్యలక్ష్మితో వివాహం జరిగింది. ఇద్దరు కుమార్తెలు జ్ఞానేశ్వరి, అన్నపూర్ణ, కుమారుడు విద్యాసాగర్. వారు అధ్యాపకులుగా కొనసాగుతున్నారు.

పుస్తకాలను తిరగరాయడంలో ప్రత్యేక గుర్తింపు..

వెంకట్రామ్ తొపుదుర్తి హైస్కూలులో హెచ్ఎస్ఎల్సీ చదువుతున్న సమయంలో పాఠ్యపుస్తకాల కొరత బాగా ఉండేది. ప్రభుత్వం ముద్రించే పుస్తకాలు సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. అలా సీనియర్స్ వద్ద కొన్న పుస్తకాలే ఉపయోగించుకునేవారు. ఆ రోజుల్లో తెలుగు వాచకం పుస్తకం లభ్యం కాకపోవడంతో, ఒక సీనియర్ వద్ద తెచ్చుకున్న పుస్తకాన్ని అచ్చంగా ముఖచిత్రం నుంచి చివరి పేజీ వరకు చక్కని దస్తూరితో తిరగరాసి ఉపయోగించుకున్నారు. ఆ పుస్తకం ఆయన తర్వాత నాలుగైదు బ్యాచ్‌లకు ఉపయోగపడింది. పుస్తకాలను తిరగరాయడంలో ఉన్న ఆనందాన్ని గుర్తించిన ఆయన రచయితల పుస్తకాను తిరగరాస్తూ...వివిధ సందర్భాల్లో వారికే కానుకగా వాటిని అందించేవారు. అలా జిల్లాలో పుస్తకాలను చేతిరాతతో తిరగరాయడంలో ప్రత్యేక గుర్తింపు పొందారు.

సేవ.. దాతృత్వం రెండు కళ్లుగా...



సేవ, దాతృత్వ గుణాలు ఆయనకు రెండు కండ్లు. నగర శివారులోని తన భూమిని ఒక గోశాలకు దానం చేశారు. తనకు చదువులు నేర్పిన చదువుల తల్లికి గుర్తుగా క్లస్టర్ యూనివర్శిటీ ఆవరణలో గత నెల 29న రూ. 2 లక్షలు ఖర్చు చేసి సరస్వతి దేవి విగ్రహాన్ని నెలకొల్పారు. అలాగే నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో చదువుల తల్లి విగ్రహానికి రూ.1.50 లక్షలతో మండపం నిర్మించారు. అనేక మంది అవధానులకు అవధాన కార్యక్రమాలకు విరాళాలు అందించారు. పద్య రచయితలను ప్రోత్సహించేందుకు, తెలుగు భాషాభివృద్ధికి వివిధ సంస్థలకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. వెంకట్రామ్ తోపుదుర్తి కందపద్యాలతో కూడిన 'శరణు శివ చరణము' పుస్తకాన్ని ముద్రించారు. ఆటవెలది రూపంలో 'తొపుదుర్తి మాట', వచన కవిత్వంలో 'అధర్మ దండనము', తేట గీతులతో 'శ్రీనివాస' వంటి పుస్తకాలు రచించారు. ప్రస్తుతం ముద్రణలో 'వరద వెంకటేశ' త్వరలో విడుదల చేయనున్నారు.

చౌడేశ్వరీమాత ఆలయ చైర్మన్‌గా నాగార్జునరెడ్డి



బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయ చైర్మన్‌గా నందవరానికి చెందిన టీడీపీ నాయకుడు పీవీ నాగార్జునరెడ్డిని నియమించినట్లు ఆలయ అసిస్టెంటు కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగార్జునరెడ్డిని నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పాలకవర్గం సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నందవరం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. అధ్యక్షుడిగా నాగార్జునరెడ్డి, ఇతర పాలకవర్గ సభ్యులుగా చింతా శ్రీనివాసులు, ఇనకండ్ల సుదర్శనరావు, ఎర్రజోడు లోకేశ్, కుమ్మరి శ్రీనివాసులు, ముక్కర హారిక, బొంతల శశికళ, ఉట్టి శారద, తప్పెట కుళాయమ్మ, చెర్వుపల్లె రాజేశ్వరి, డి. బాల దస్తగిరి, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా కాసుల నాటి రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

కర్నూలు బ్లడ్ బ్యాంక్‌కు గుర్తింపు



కర్నూలు జీజీహెచ్‌లోని బ్లడ్ బ్యాంకు

కర్నూలు హస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న రక్తనిధి కేంద్రం స్టేట్ బెస్ట్ బ్లడ్ బ్యాంకుగా ఎంపికైనట్లు డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్ తెలిపారు. అలాగే కర్నూలు జీజీహెచ్‌లో ఉన్న ఐసీటీసీ కేంద్రానికి కూడా రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు వెల్లడించారు. కర్నూలు జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు ఎక్కువ రక్త శిబిరాలు నిర్వహించడంతో పాటు ఈ-రక్తకోస్ ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ముందుంటడంతో స్టేట్ బెస్ట్ బ్లడ్ బ్యాంకుగా ఎంపికైందన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం రోజులైన డిసెంబరు 1 విజయవాడలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఈ రెండు అవార్డులు అందజేస్తున్నట్లు ఏపీ శాక్స్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఆలీహైదర్ తెలిపారు.

మహానందిలో ఆన్‌లైన్ సౌకర్యాలు

మహానంది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భక్తులు మహానందీశ్వరుని దర్శనం, వసతి గదులను బుక్ చేసుకోవడం మొదలైన వాటిని బుక్ చేసుకోడానికి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మహానంది క్షేత్రంలో ఆన్‌లైన్ పద్ధతిలో సేవా దర్శనం, వసతి గదులు, ప్రసాదాల కొనుగోలు వంటివి బుక్ చేసుకొనే విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. .

శ్రీశైలంలో బుల్లితెర నటులు



మల్లన్న సన్నిధిలో శ్రీముఖి

శ్రీశైలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను యాంకర్ శ్రీముఖి, బుల్లితెర నటుడు అవినాశ్ దర్శించుకున్నారు. శనివారం తెల్లవారుజామున ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు కుంకుమార్చనలు చేసుకున్న వారికి అర్చక వేదపండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి నల్లారెడ్డి

అధ్యాపక, నాటక, న్యాయవాద, సాహితీ రంగంలో రాణింపు

కళ

ఆదోని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాటకరంగం అనగానే గుర్తుకొచ్చేది వేదిక, తెర వెనక కృషి, సంభాషణలు, పాత్రలలోని లోతులు. కానీ ఆ పాత్రలకు ప్రాణం పోసేది నటుడు. అలాంటి విశిష్ట నటుడు ఆదోనికి చెందిన నల్లారెడ్డి. ఆయనకిచ్చే ఏ ప్రాత అయినా కేవలం నటించడం కాదు. ఆ ప్రాతలో తానే మమేకమై జీవిస్తారు. దుర్యోధనుడి ఆగ్రహం, అహంకారం, గాంభీర్యాన్ని అలవోకగా ప్రదర్శిస్తూ రాణిస్తున్నారు ఆయన. ఒకే నాటకంలో రెండు విభిన్న పాత్రలు పోషించడం అనేది సాధారణంగా చాలా కష్టమైన పని. స్వరం, శరీర భాష, భావోద్వేగం అన్నింటిలోనూ తేడా చూపించాల్సి ఉంటుంది. ఈ సవాల్‌ను సులువుగా జయించి ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాడు నల్లారెడ్డి.



అర్జునుడి వేషధారణలో

నాటకరంగంతో పాటు ఉపాధ్యాయ వృత్తిలోనూ ఆయన విశిష్టమైన స్థానం సంపాదించారు. అధ్యాపకుడిగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే మరో వైపు నాటక రంగంలో కూడా రాణిస్తున్నారు. అధ్యాపక వృత్తి, నాటక రంగంతో పాటు కవిత్వంలోనూ ఆయన నేర్పరి. లోతైన ఆలోచనలను సరళమైన పదాలతో చెప్పగల ఆయన శైలి పాఠకుల మనసును తాకుతుంది. కవిత్వం ద్వారా సమాజంలోని సున్నితమైన అంశాలను వెలికితీసి ఆలోచింపజేయగల శక్తి ఆయన సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. వీటికి తోడు న్యాయవాద వృత్తిలోనూ నల్లారెడ్డి తన ప్రతిభను చాటుకున్నారు. సమాజ సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించడంలో ఆయన తన న్యాయవాద వృత్తిని కూడా కొనసాగిస్తున్నారు. నటుడిగా, ఉపాధ్యాయుడిగా, న్యాయవాదిగా, కవిగా ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచిన నల్లారెడ్డి పొందిన అవార్డులు, రివార్డులు ఆయన ప్రతిభకు నిదర్శనం.



కృష్ణుడి వేషధారణలో నల్లారెడ్డి

నాటకాలపై తాత పెద్ద గోవిందప్ప, తండ్రి గొంగల మునెప్పల ద్వారా ఆసక్తి పెంచుకున్న ఆయన, 1998 నుంచి నిరంతరంగా ఈ రంగంలో కొనసాగుతున్నారు. పడకసీనులో కృష్ణుడిగా, భవానీ శంకరుడు, బిల్వమంగళుడు చింతామణి నాటకం, సత్యహరిశ్చంద్రలో కాటికాపరిగా, నారదుడు, దుర్యోధనుడి పాత్రల్లో రాణించారు. అదేవిధంగా బాలనాగమ్మ నాటకంలో కార్యవర్ది రాజుగా, భువనవిజయం నాటకంలో ధూర్జటిగా తన ప్రతిభను కనబరిచారు. నల్లారెడ్డి కళాసేవలకు గాను శ్రీకృష్ణదేవరాయలు పంచ శతాబ్ది ఉత్సవాల్లో ఉత్తమ అవార్డు అందుకున్నారు. జిల్లాస్థాయి ఉగాది అవార్డులతో పాటు, తిరుపతిలో జరిగిన ఉత్సవాల్లో ఆయన పలు అవార్డులు, సత్కారాలు అందుకున్నారు.

నేడు దండెబోయిన స్మారక పురస్కార ప్రదానోత్సవం

కర్నూలు కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని సాహితీ సదస్సు, తెలుగు భాషా వికాస ఉద్యమం, ప్రభుత్వ ఉన్నత విద్యా అధ్యయన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'దండెబోయిన బాలరంగయ్య-పాపులమ్మ స్మారక పురస్కార ప్రదానోత్సవం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, లక్ష్మయ్య, దండెబోయిన రమేష్‌లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు, బి.క్యాంపులోని ప్రభుత్వ విద్యా అధ్యయన కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌యూ, క్లస్టర్ యూనివర్సిటీల వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు హాజరవుతారన్నారు. సభాధ్యక్షులుగా ప్రభుత్వ ఉన్నత విద్యా అధ్యయన సంస్థ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ ఆదినారాయణరెడ్డి, విశిష్ట అతిథిగా క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర హాజరవుతారని తెలిపారు. ఈ సభలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య, మంత్రాలయం ఏవో ఎల్.మాధవశెట్టి, కరివే న నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, బీఎడ్ కళాశా ల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్ పాల్గొంటారన్నారు. ఆశీఃప్రసంగం చేస్తారని తెలిపారు. అనంతపురం జిల్లా లేపాక్షికి చెందిన సింధే రామమూర్తి బృందానికి పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ బాధితులకు న్యాయం

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ, జాయింట్ కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు జిల్లా యంత్రాంగం న్యాయం చేస్తుందని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో బాధితుల పట్ల అధికార యంత్రాంగం తక్షణ స్పందనతో ముందుకు రావాలని సూచించారు. కమిటీ సభ్యులు చేసిన సూచనలను క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ 2022 నుంచి ఆగస్టు 2025 వరకు 343 మంది నిందితులపై ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని, 570 మంది బాధితులకు రూ.7.84 కోట్లు పరిహారం అందించామన్నారు. సెప్టెంబరు 2025 నుంచి నవంబరు 2025 వరకు 22 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని, 69 మంది బాధితులకు రూ.90.12 లక్షలు పంపిణీ చేసినట్లు వివరించారు. కేసులన్నింటినీ క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, అదనపు ఎస్పీ యుగంధర్‌బాబు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, డీఆర్వో రామునాయక్, నంద్యాల, డోన్ ఆర్డీవోలు విశ్వనాథ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు రాజకుమారి స్పష్టం చేశారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఎస్పీ సునీల్ సెరాన్‌తో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల అరికట్టడంలో మొత్తం యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, అదనపు ఎస్పీ యుగంధర్‌బాబు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎస్సీ, ఎస్టీ కోర్టు-కర్నూలు) వై.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టులో జిల్లాలోని న్యాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీకి వీలున్న కాంపౌండబుల్ క్రిమినల్, ఎక్సైజ్, చెక్‌బౌన్స్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయ సేవాసదన్ భవన్‌లో ప్రతి రోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లను ఏర్పాటుచేసి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకుని కేసుల నుంచి ఉపశమనం పొందాలని కోరారు. వీసీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బి.లీలా వెంకట శేషాద్రితో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని న్యాయాధికారులందరూ పాల్గొన్నారు.

ముగిసిన బేస్‌బాల్ జిల్లా స్థాయి పోటీలు



విజేతలకు జ్ఞాపికను అందిస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపికలో భాగంగా మండలంలోని అహోబిలంలో మూడు రోజులుగా జరుగుతున్న క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప జట్లు వరుసగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన వారికి జ్ఞాపికలు, షీల్డులు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శంకరప్రసాద్, వీఆర్వో హరినాయక్ అందించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిజయవిజంగ్, సెక్రేటరీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

7న హిందూ సమ్మేళన పాదయాత్ర



గోడ పత్రికలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడుమూరు, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి):కోడుమూరు పట్టణం లో డిసెంబరు 7న హిందూ సమ్మేళన మహా పాదయాత్ర జరుగుతుందని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. పట్టణంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణం, గాలి గోపుర నిర్మాణ సందర్భన నిమిత్తం విజయవాడ అష్టాక్షరీ పీఠం రామానుజ జీయర్ స్వామి, నారాయణపేట మండలంలోని అంబాత్రయ పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీస్వామి వస్తారని, ఈ సందర్భంగా రామాలయం నుంచి లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు హిందూ సమ్మేళన మహాపాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు.

తెల్లారిన జీవితాలు!

(5వ పేజీ తరువాయి)

. అక్కడ ఎదురుగా ఆదోని వైపునకు వస్తున్న ఏపీ39 ఎస్ఎస్2020 నంబర్ గల ఫార్చునర్ కారు ఒకటికొకటి వేగంగా ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో దంపతులు సతీష్ కుమార్, మీనాక్షి, వారి కుమారుడు రిత్విక్‌తో పాటు మీనాక్షి తండ్రి వెంకటేషప్ప, మేనల్లుడు బనిత్‌గౌడ్‌లు కారులోనే ఇరుక్కొని మృత్యువాత పడ్డారు. మీనాక్షి తల్లి గంగమ్మ, డ్రైవింగ్ చేస్తున్న చేతన్‌లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. అలాగే ఫార్చునర్ కారులో ప్రయాణిస్తున్న అశోక్, జాహ్నవి, రాధికతో పాటు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన ఆదోనిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన గంగమ్మ, చేతన్‌లను మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

కూలిన కలల సౌధం...

సతీష్, మీనాక్షి ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బెంగళూరులో స్థిరపడ్డారు. సంపాదించినదాంట్లో కొంత పోగు చేసి బెంగళూరులోనే నివాసం ఉండడానికి ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ సంతోషాన్ని తల్లిదండ్రులతో పంచుకొని మూడు రోజుల క్రితం తమ వివాహ వేడుకను జరుపుకొని బెంగళూరుకు వెళ్లేలోపు మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శనం చేసుకోవాలని మొక్కుకున్నారు. అందులో భాగంగానే కారులో భార్య, కొడుకు, అత్తా, మామ, అల్లుడితో కలసి సతీష్ కారులో రాత్రి పదిగంటలకు అత్తమామల స్వగ్రామం నుంచి మంత్రాలయానికి బయల్దేరారు. మధ్యమధ్యలో తీపిజ్ఞాపకాలను నెమరువేసుకుంటూ వారి ప్రయాణాన్ని సాగించారు. శనివారం ఉదయం దైవదర్శనం చేసుకొని తిరిగి సొంత గ్రామానికి చేరుకోవాలని రెండు రోజుల్లో బెంగళూరుకు వెళ్లి విధులకు వెళ్లాలని సతీష్, మీనాక్షి మాట్లాడుకున్నారు. చల్లగాలికి నిద్ర రావడంతో మాట్లాడుతూ.. మాట్లాడుతూ ఎవరి సీట్లలో వారు కునుకు తీశారు. సతీష్ ముందు సీటులో తన కుమారుడు రిత్విక్‌ను ఒడిలో కూర్చొ బెట్టుకున్నాడు. వెనక్కి సీటులో భార్య మీనాక్షి, తన అమ్మ, నాన్నలు, అన్న కుమారుడు బనిత్‌గౌడ్ కూర్చొని నిద్రలోకి జారుకున్నారు. ఒక గంటలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి క్షేత్రానికి చేరుకోవాల్సిన వారు కారు ప్రమాదంలో కన్నుమూశారు.

నాన్న ఒడిలోనే చివరిశ్వాస

ఏబిడ్డకైనా తన నాన్న ఒడి మృత్యుఒడి అవుతుందా? కాదు.. కానీ చిన్నారి రిత్విక్ విషయంలో మాత్రం తన నాన్న ఒడే మృత్యు ఒడి అయింది. 'నాన్నా నేను అమ్మతో ఉండను. నీతోనే కూర్చుంటా' అంటూ గారాం చేసిన బాలుడు రిత్విక్‌ను తండ్రి చేరదీసి తన ఒడిలో పడుకోబెట్టుకుని జోకొట్టి నిద్రపుచ్చాడు. కుమారుడు నిద్రలోకి జారుకోగానే సతీష్‌కూడా కునుకు తీశాడు. ఘోర రోడ్డు ప్రమాదం జరిగి వీరు ప్రయాణిస్తున్న కారు, ఎదురుగా వస్తున్న కారు ఒకటికొకటి ఢీకొనడంతో కూర్చున్న చోటే తండ్రి కొడుకులు విగత జీవులయ్యారు. ఈ భయానక దృశ్యాన్ని చూసిన స్థానికులు 'అయ్యో పాపం.. దేవుడు ఎంత పనిచేశాడు.. పసికందులను సైతం తీసుకెళ్లాడు.. పాపం తండ్రి ఒడిలోనే ఆ కొడుకు చనిపోయాడు...' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

బతికించిన ఎయిర్‌బ్యాగ్స్!

విశాఖపట్నానికి చెందిన అశోక్ చౌదరి.. భార్య రాధిక, కుమార్తె జాహ్నవితో కలసి ఆదోనికి బయలుదేరారు. వారి సమీప బంధువుల రిసెప్షన్ ఉండటంతో విశాఖ నుంచి విమానంలో హైదరాబాదు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆదోనికి చెందిన ఫార్చునర్ కారులో ఆదోనికి బయల్దేరారు. వీరి వాహనం ఆరేకల్లు, కొటేకల్లు మధ్యలోకి రాగానే ఎదురుగా వస్తున్న కర్ణాటక కారు ఒకటికొకటి ఢీకొన్నాయి. ఈ క్రమంలో కర్ణాటక కారులో ప్రయాణిస్తున్న ఐదు మంది మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. కాని వీరు ప్రయాణిస్తున్న ఫార్చునర్ కారుకు ప్రమాదం జరిగిన వెంటనే ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో మాత్రమే బయటపడ్డారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఐజీ

కొటేకల్లు, ఆరెకల్లు గ్రామాల మధ్య జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సమాచారం తెలుసుకున్న కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఏఎస్పీ హుసేన్‌పీరా, జేసీ నూరుల్ కామర్, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తెల్లవారు జామున 4:20 గంటలకు ప్రమాద సంఘటన జరగడంతో సమాచారం తెలుసుకున్న డీఎస్పీ భార్గవి, సీఐలు చిరంజీవి, శ్రీనివాసులు, మంజునాథ్, నల్లప్ప, రామాంజులు, ఎస్ఐలు శ్రీనివాసులు, మల్లికార్జున, రామాంజనేయులు, తహసీల్దార్ శేషఫణి, పోలీసు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అంబులెన్స్‌లను పిలిపించుకొని గాయపడిన వారిని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అలాగే కారులో ఇరుక్కుపోయిన ఐదుగురి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న మృతుల బంధువులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.



కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగమ్మ, చేతన్



మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్



నుజ్జునుజ్జు అయిన కారును పరిశీలిస్తున్న ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కొటేకల్లు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరగడం చాలా బాధాకరమని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ విచారం వ్యక్తం చేశారు. ఎదురెదురుగా వస్తు రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మృత్యువాత పడ్డారన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు సిబ్బంది అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. అయినప్పటికీ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. మలుపుల వద్ద బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రివేళల్లో ఫేస్‌వాష్ వంటి కార్యక్రమాలను చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించామన్నారు. వాహనదారులు కూడా రోడ్డు భద్రతానియమాలను పాటించాలన్నారు.

ఐదుగురి మృతిపై మంత్రి బీసీ దిగ్భ్రాంతి



బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై రోడ్డు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడడం, మృతుల్లో చిన్నారులు ఉండడంపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సం తాపం తెలిపారు. గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి బీసీ కర్నూలు ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు.

బాధితులను పరామర్శించిన మంత్రి భరత్



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి, కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామ సమీపంలో జరిగిన కారు ప్రమాద బాధితులను మంత్రి టీజీ భరత్, కలెక్టర్ ఏ.సిరి పరామర్శించారు. శనివారం ఉదయం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్‌లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న గంగమ్మ, డ్రైవర్ చేతన్‌లను కలిసి భరోసానిచ్చారు. వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాద సంఘటన చాలా బాధాకరం: బీవీ



మంత్రాలయం పుణ్య క్షేత్రం దర్శనార్థం వచ్చిన కర్ణాటక భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కొటేకల్లు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సంఘటనను ఆయన పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, మృతదేహాల అప్పగింత తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



కారులో కూర్చున్న చోటే మృతి చెందిన మీనాక్షి



ప్రమాద స్థలంలో మృతి చెందిన వెంకటేశప్ప



కారులోనే మృతి చెందిన సతీష్



ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలలో రోదిస్తున్న మృతుల బంధువులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

మొక్కజొన్న పంటపై గడ్డి మందు పిచికారి

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపులలో గుర్తు తెలియని వ్యక్తులు పచ్చని మొక్కజొన్న పంటపై గడ్డిమందు పిచికారి చేసినట్లు బాధిత రైతు రమాదేవి శనివారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి రమాదేవి అనే మహిళా రైతు తన రెండెకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేసింది. పంట బాగా పెరిగింది. తనపై వ్యక్తిగత కక్షలను మనసులో పెట్టుకొని మొక్కజొన్న పైరుపై గడ్డిమందు చల్లడంతో పైరు పూర్తిగా ఎండిపోయింది. రూ.70వేలు పంట నష్టం వాటిల్లినట్లు మహిళా రైతు తెలిపారు. బాధితులపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు

బిల్లులు ఆదివారం కూడా చెల్లించొచ్చు

కల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు 30వ తేదీ (ఆదివారం) కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డివి జన్లలోని అన్ని బిల్లు చెల్లింపు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ఎస్ఈ సూచించారు. ఈఅవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం:

విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా సంతోష్‌నగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి తెలిపారు. ఈమేరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సంతోష్‌నగర్, శ్రీలక్ష్మీస్కూల్ ఏరియా, అనురాగ్ ఎస్టేట్, టాటా షోరూం ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు.

డిగ్రీలో తొమ్మిది మంది డిబారు

కర్నూలు అర్బన్ నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 5వ సెమిస్టర్లో తొమ్మిది మంది విద్యార్థులు డిబారు అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాల్లో 6,900 మంది దరఖాస్తు చేసుకోగా 6,383 మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

ఉద్యోగి మృతదేహం కోసం గాలింపు

పాణ్యం, నంద్యాల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పుల్లయ్య(60) మృతదేహం కోసం శనివారం పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కుందూనదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 14 వతేదీన హత్య చేసి పాణ్యం మండలం మద్దూరు వద్ద కుందూనదిలో మృతదేహాన్ని వేసినట్లు నిందితులు తెలపడంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గోస్పాడు మండలం తేళ్లపురి వద్ద మృతదేహాన్ని గుర్తించినట్లు వారు తెలిపారు.

నంద్యాల శ్యాం నగర్‌కు చెందిన పుల్లయ్య కుమారుడు ఆదిత్యప్రసాద్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేశారు. ఈనెల 14 ఆయనను హత్య చేసి మద్దూరు వద్ద కుందూలో పడేసినట్లు నిందితులు తెలపడంతో పోలీసులు గాలించి వెలికి తీశారు. మృత దేహానికి వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

హిట్ అండ్ రన్ కేసులపై దృష్టి పెట్టండి

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నమోదైన హిట్ అండ్ రన్ కేసులపై దృష్టి సారించి వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక న్యాయ సేవా సదన్ భవన్‌లో హిట్ అండ్ రన్ కేసులపై ఏర్పాటైన జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న హిట్ అండ్ రన్ కేసుల పురోగతిపై ఆయన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం అందించే సహాయంతో పాటు బీమా మొత్తం కూడా బాధితులకు తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, ఆర్ అండ్‌బీ, డీఎంహెచ్‌వో పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భూవివాదం

- ఇద్దరి మధ్య గొడవ, ఒకరికి తీవ్ర గాయం



గాయపడ్డ రవిశంకర్‌గౌడ్

కర్నూలు రూరల్ నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండల తహసీల్దార్ కార్యలయ ఆవరణలో శనివారం ఇద్దరి మధ్య భూ వివాదం చోటుచేసుకొంది. కార్యాలయానికి విచారణకు వచ్చిన ఆ ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దిగారు. ఇందులో ఒకరి తలకు తీవ్ర గాయమైంది. రెవెన్యూ అధికారులు చికిత్స కోసం ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలు రూరల్ మండలం భూపాల్‌నగర్‌కు చెందిన గురునాథ్ 2024లో మాజీ సైనికుడు గోపాల్ నుంచి నందనపల్లె పంచాయతీ పి. రుద్రవరం మజరా పరిధిలోని సర్వేనెంబరు 608- హెచ్‌లో 2.50ఎకరాలు కొన్నారు. నందికొట్కూరు మండలం తాటిపాడు గ్రామానికి చెందిన ఈడిగ రవిశంకర్‌గౌడ్ కొన్నేళ్ల క్రితం భూపాల్‌నగర్ (అమ్మమ్మ ఊరు)కు వచ్చి స్థిరపడ్డారు. గురునాథ్ కొన్న పొలం పక్కన్నే రవిశంకర్‌కు మూడెకరాల భూమి ఉం ది. ఇది ప్రభుత్వ భూమి కావడంతో కృష్ణమోహన్‌రెడ్డి తహసీల్దార్ హయాంలో రవి పట్టా పాసుబుక్కు తెచ్చుకున్నారు. వీరి ఇద్దరూ రస్తా విషయంలో పలుమార్లు గొడవ పడ్డారు. తన పొలంలోని అర ఎకరా రవిశంకర్ అక్రమించాడని గురునాథ్ ఆరోపిస్తున్నారు. ఈ వివాదం ఏడాదిన్నర నుంచి తహసీల్దార్ వద్ద నడుస్తోంది. ఒరిజనల్ పత్రాలతో విచారణకు రావాలని శనివారం తహసీల్దార్ రమేష్‌బాబు వీరిద్దరిని పిలిపించారు. శనివారం వీరు కార్యాలయానికి రాగానే ఒకరినొకరు దూషించుకుంటు ఘర్షణపడ్డారు. ఈ వివాదంపై రెండో పట్టణ పోలీసులకు తహసీల్దార్ సమాచారం ఇచ్చారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు సర్టిఫికెట్లు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గుర్తింపు పొందిన ట్రాన్స్‌జెండర్లకు సర్టిఫికెట్లను హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. 17మంది ట్రాన్స్‌జెండర్లు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇందులో 16మంది అర్హులుగా గుర్తించారు. శనివారం ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శిబిరంలో ట్రాన్స్‌జెండర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సామాజిక ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఎంతగానో వాటికి దోహదపడుతాయని పేర్కొన్నారు. గుర్తింపు సర్టిఫికెట్లు పొందడం ద్వారా విద్యా, వైద్యం, ఉద్యోగావకాశాలు, సంక్షేమ పథకాలు లబ్ధి పొంద వచ్చన్నా రు. కార్యక్రమంలో ఏఆర్ఎంవో డా.సునీల్ ప్రశాంత్, విజయ మహిళా మండలి ప్రోగ్రాం మేనేజర్ విజయ, సీనియర్ అసిస్టెంట్ శ్రీను, ఏఎన్ఎం రాధ పాల్గొన్నారు.

ఇట్లయితే ఎట్ల?

5వ పేజీ తరువాయి

ఆర్‌టీఓ అధికారులు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్థాయి సంఘ సమావేశాలకు రాని జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేయాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు.

● కూటమి ప్రభుత్వంపై చైర్మన్ నిందలు...

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి వైసీపీ పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో ప్రతి స్థాయి సంఘ సమావేశంలో కూటమి ప్రభుత్వంపై నిందలు మోపుతూ అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మండలాల్లో సమస్యలను జడ్పీటీసీలు అడగాల్సి ఉండగా చైర్మనే అడుగుతున్నారు. ప్రతి శాఖకు సంబంధించిన సమస్యలపై చైర్మన్ విసిగిస్తున్నారని అధికారులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలోకి తీసుకువస్తున్న విషయం స్థాయి సంఘ సమావేశాలో చర్చించడం సరికాదు. కావాలనే ఈ అంశాన్ని కూడ చైర్మన్ ఇందులో ప్రస్తావించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● జడ్పీటీసీలు ఏమన్నారంటే..

చంద్రన్న బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని..కేవలం పబ్లిసిటీ కోసమే దీన్ని తీసుకువచ్చారని కొత్తపల్లి జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లు ఇంకా పూర్తి కాలేదనీ, కూటమి ప్రభుత్వం ఇళ్లు ఇస్తామని మళ్లీ చెబుతున్నదనీ, అవి ఎన్నటికి పూర్తి కావాలని వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న అన్నారు. డోన్‌లోని వంద పడకల ఆసుపత్రిలో వైద్యులు నార్మల్ డెలివరీలు చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతున్నారని జడ్పీటీసీ రాజకుమార్ విమర్శించారు. బ్రాహ్మణకొట్కూరులో కాలువలు శుభ్రం చేయడం లేదని జడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. మండల సమావేశాలకు పంచాయతీ కార్యదర్శులు రావడము లేదని ఓర్వకల్లు జడ్పీటీసీ రంగనాథ గౌడు డీపీఓకు ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీలు, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, రంగనాథ గౌడు, సుంకన్న, పోచా జగదీశ్వరరెడ్డి, , ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

చాగలమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన చాగలమర్రిలో శనివారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. గ్రామంలోని డిగ్రీ కళాశాల సమీపంలో దస్తగిరి (27) అనే యువకుడు నివాసం ఉంటున్నాడు. మూడేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల కుటుంబకలహాలు అధికమయ్యాయి. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో అతడు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు చూసేసరికి మరణించాడు. మృతుడికి భార్య, కూతురుఉన్నారు మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెంచు యువకుడిపై ఎలుగుబంట్లు దాడి

శ్రీశైలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల క్షేత్ర పరిధిలో గల హఠకేశ్వరం ఆలయ సమీపం వద్ద అటవీ ప్రాంతంలోనికి కట్టెలు తెచ్చుకునేందుకు వెళ్లిన చెంచు యువకుడిపై ఎలుగుబం ట్లు దాడిచేశాయి. శనివారం మధ్యాహ్నం చెంచుగూడెంకు చెం దిన చిన్నదేవయ్య(20) కట్టెలు కొడుతుండగా ఆకస్మాత్తుగా వచ్చిన ఎలుగుబంటి దాడిచేసి తొడపై గాయంచేసింది. భయాందోళనకు గురైన దేవయ్య గట్టిగా కేకలు వేస్తూ పరుగులు పెట్టేందుకు య త్నిస్తుండగా మరో రెండు ఎలుగుబంట్లు కూడా దాడి చేశాయి. గా యాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం సున్నిపెంట ప్రభు త్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ఆసుపత్రికి తర లిస్తున్నట్లు అటవీశాఖ ఎఫ్ఆర్‌వో ఎం.పరమేశులు తెలిపారు.

ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం డిస్కం అధ్యక్షుడిగా పెద్దయ్య

కల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (డిస్కం) కంపెని అధ్యక్షుడిగా పెద్దయ్య ఎన్నికయ్యారు. శనివారం ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో డిస్కం అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దయ్యను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుకు కృషి చేస్తానన్నారు. ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్‌కు పూల బోకే అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరి సుబ్బన్న, జిల్లా కార్యవర్గ నాయకులు శ్రీనివాసులు, నాగశేషులు, విన్సెంట్, బెళగల్ ఉసేని తదితులు పాల్గొన్నారు.

ఏసీబీ కేసులో కోఆపరేటివ్ ఉద్యోగికి జైలు

కర్నూలు లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లోన్‌లో వన్‌టైమ్ సెటిల్మెంట్ చేయడానికి రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఓ అధికారికి కర్నూలు ఏసీబీ కోర్టు శిక్ష ఖరారు చేసింది. అనంతపురం జిల్లా కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రికవరి అధికారి అయిన నిందితుడు ఆర్.సుబ్బయ్యకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2లక్షలు జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఎస్.శ్రీవిద్య శనివారం తీర్పు చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన ఫిర్యాది షేక్ సమీర్ బాషా పట్టణంలో స్టీల్ ఫర్నీచర్ షాపు నిర్వహిస్తుండేవాడు. అతని అత్త టి.మహమ్మదాబీ ఏపీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ అనంతపురం నుంచి గతంలో హౌసింగ్ లోన్ తీసుకున్నారు. ఆ లోన్ మొత్తాన్ని వన్‌టైమ్ సెటిల్మెంట్ చేసుకోవడానికి ఆమె అప్పటి అనంతపురం ఏపీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్, రికవరి అధికారి ఆర్.సుబ్బయ్యను సంప్రదించారు. లోన్ మొత్తం వన్‌టైమ్ సెటిల్మెంట్ చేయడానికి, హైదరాబాదు నుంచి రిపోర్టును తెప్పించడానికి రూ.10వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడానికి అంగీకరించని టి.మహమ్మదాబీ తన అల్లుడు షేక్ సమీర్‌బాషాతో కలిసి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు వలపన్ని 2013 మే నెల 3వ తేదీన నిందితుడు ఆర్.సుబ్బయ్యను అనంతపురంలో సుభాష్ టైర్ ఏజెన్సీ సమీపంలో ఫిర్యాది షేక్ సమీర్ బాషా నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు విచారించిన ఏసీబీ అధికారులు నిందితునిపై కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితునిపై నేరం రుజువు కావడంతో వివిధ సెక్షన్ల కింద ఏడు సంవత్సరాల కఠిన కారాగారశిక్ష రూ.2 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ భగవాన్ వాదించారు.

అడ్డంకులు సృష్టించినా.. అభివృద్ధి చేస్తా

- ఏడాది లోపే గడివేముల బైపాస్ రోడ్డు
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- మూలపెద్దమ్మ పాలక మండలి ప్రమాణ స్వీకారం

గడివేముల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు జరుగకుండా కొందరు అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని ఎదుర్కొని అభివృద్ధి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండల కేంద్రంలోని మూల పెద్దమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడివేములలో ఇరుకు రోడ్ల కారణంగా తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి అనుమతులు ఇప్పించామని అన్నారు. కొంతమంది బైపాస్‌రోడ్డును అడ్డుకునేందుకు కోర్టుకు వెళ్లాలని చూస్తున్నారని అన్నారు. వారి కుట్రలను ఎదుర్కొని త్వరలోనే భూమిపూజ నిర్వహిస్తామన్నారు. ఏడాదిలోపే బైపాస్ రోడ్డు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.3 కోట్లతో సరిపోయే దానిని గత ప్రభుత్వంలో కొందరు కమీషన్లకు కక్కుర్తితో మరమ్మతులను చేయించలేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టిందన్నారు. ఓర్వకల్లు మండలంలో ఇండస్ట్రిహబ్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపడుతున్నామ న్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

మూలపెద్దమ్మ ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

మూలపెద్దమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా రమణారెడ్డి, మరో 9 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గౌరుచరిత కమిటీ సభ్యులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దిలిప్‌కుమార్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సీతారామిరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, పాణ్యం మార్కెట్‌యార్డ్ చైర్మన్ అంగజాల గీత, అగ్రికల్చర్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ వడ్డు లక్ష్మీదేవి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మంజునాథ్, సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ రఫిక్, జనసేన మండల కో-ఆర్డినేటర్ చంద్రమోహన్, జనసేన నాయకులు రఫిక్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా


ఎస్పీకి బొకే అందిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎస్పీ సునీల్ షెరాన్‌ను ఆయన కార్యాలయంలో శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలపై ఎస్పీతో చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గట్టి పోలీసు నిఘా ఉంచాలని కోరారు. శ్రీశైల పవిత్రకు విఘాతం తలెత్తకుండా పోలీసుశాఖ తరుపున బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి


మాట్లాడుతున్న సురేంద్ర

బండిఆత్మకూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సహకార సంఘాల ప్రతినిధి సురేంద్ర కోరారు. శనివారం మండలంలోని సంతజూటూరు గ్రామంలో పరమటూరు రైతు సేవా సహకార సంఘంలో సీఈవో గోపాల్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాబార్డు అందిస్తున్న ఆర్థిక సాయాన్ని రైతులు తీసుకుని సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. సైబర్ నేరాలు అధికమయ్యాయని, ఎవరికీ వివరాలు ఇవ్వవద్దన్నారు. రైతులకు అతి వేగంగా సహకార సంఘాల రుణాలు ఇస్తాయని, సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సుధారాణి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీవాణి తెలిపారు. సమావేశంలో సిబ్బంది విజయ్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలను పాటించాలి


బస్సును తనిఖీ చేస్తున్న ఆత్మకూరు ఏఎంవీఐ నాగేంద్రరావు

నందికొట్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల బస్సులు భద్రతా ప్రమాణాలను పాటించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఏఎంవీఐ నాగేంద్రరావు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల బస్సులను ఏఎంవీఐ తనిఖీ చేశారు. స్కూల్ బస్సులో విద్యార్థుల రక్షణ కోసం భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని డ్రైవర్లకు, పాఠశాల యాజమాన్యాలకు సూచించారు.

గెలుపు ఓటములు దైవాధీనం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బిషప్ సంతోష్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోటీల్లో గెలుపోటములు దైవాధీనమని క్రీడాస్ఫూర్తి ప్రదర్శించి ఆడాలని నంద్యాల డయాసిస్ బిషప్ రైట్.రెవ. సంతోష్‌ప్రసన్న అన్నారు. శనివారం ఎస్పీజీ క్రీడా మైదానంలో 8పాస్ట్రేట్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కెథడ్రల్ పాస్ట్రేట్-ఎ, పాస్ట్రేట్-8 జట్ల మధ్య జరిగిన పోటీల్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాస్ట్రేట్-ఎ జట్టు నిర్ణీత 10ఓవర్లలో 126పరుగులకు 5వికెట్లు కోల్పోయింది. విజయలక్ష్యంతో బరిలో దిగిన పాస్ట్రేట్-8జట్టు 8.4ఓవర్లలో 53పరుగులకే ఆలౌట్‌అయింది. పాస్ట్రేట్-ఎ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో సెక్రటరీ ప్రభుదాస్, ట్రెజరర్ నందం ఐజాక్‌బాబు, అసిస్టెంట్ సెక్రటరి స్టీఫెన్, రెవ.జోసఫ్‌బాబు, కన్వీర్లు సురేష్‌పాల్, జెడ్.రిచర్డ్స్, గురువులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

పాణ్యం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఇచ్చిన ఉద్యోగ శిక్షణ శనివారం ముగిసింది. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 40మంది ఒకేషనల్ విద్యార్థులకు జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ బేసిక్ కాన్సెప్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ అశోక్‌కుమార్, హెచ్ఓడి సోఫియా ప్రియదర్శిని, కళాశాల అధ్యాపకులు, శ్రీనివాసులు, ఖాదరి, పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం నిత్యాన్నదాన ప్రసాద వితరణ పథకానికి కృష్ణాజిల్లాకు చెందిన రామదీక్షితులు రూ. లక్ష విరాళం ఆలయ పర్యవేక్షకులు శివ ప్రసాద్‌కు అందజేశారు. దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూ ప్రసాదాలు, పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

మహానందిలో అయ్యప్ప భక్తుల కోలాహలం


క్యూలో నిల్చొన్న అయ్యప్ప భక్తులు

మహానంది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం శనివారం వేలాదిమంది అయ్యప్ప మాల ధరించిన భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అయ్యప్పస్వాములు ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పరమశివుని దర్శించుకున్నారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరున్ని, కామేశ్వరీదేవి అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరాలు సమర్పించారు. పరిసరాల్లోని నవనంది క్షేత్రాలతో పాటు, భారీ నంది విగ్రహాన్ని తిలకించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

పాములపాడు, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఉద్యాన శాఖ అధికారి చందన, సైంటిస్ట్ ఆదినారాయణ, పతంజలి మేనేజర్ రమణా రెడ్డి అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ అధికారి చందన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంద న్నారు. ఆసక్తిగల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

క్రీడలు శారీర దృఢత్వాన్నిస్తాయి

నంద్యాల హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక ఉల్లాసాన్ని, దృఢత్వాన్నిస్తాయని నంద్యాల ఎంఈవో శివప్రసాద్ అన్నారు. శనివారం నంద్యాల మండలం ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. పురుషులకు క్రికెట్ పోటీలు, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించి ఎంఈవో-2శివప్రసాద్, గోస్పాడు ఎంఈవో సురేంద్ర, ప్రధానోపాధ్యాయులు అసదుల్లా హుసేన్, పీవీ సుబ్బయ్య ప్రారంభించారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 13, 14తేదీల్లో జరిగే నంద్యాల డివిజన్ ఆటలపోటీల్లో పాల్గొంటున్నట్లు కో ఆర్డినేటర్ చంద్రావతి, డివిజనల్ కో ఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

- విశేషంగా తరలివచ్చిన భక్తజనులు
- గ్రామోత్సవంలో ఆకట్టుకున్న వేషధారణలు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

ఆత్మకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం విళక్కిపూజా (పడి పూజ) మహోత్సవం అత్యంత కమనీయంగా జరిగింది. ప్రాతఃకాల సమయం నుంచే స్వామివారికి గణపతిహోమం, నవ విధ, అష్టోత్తర కలశాభిషేకాలు, సహస్రనామ, కుంకుమార్చనలు, పుష్పాభిషేకము వంటి తదితర పూజాక్రతువులను నిర్వహించారు. పడిపూజ ఉత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారికి చేసిన పుష్పాలంకారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


దేవతామూర్తుల వేషధారణలో అయ్యప్ప మాలధారులు

అనంతరం సాయంకాలం 7.30గంటలకు పదునెట్టంబడిపూజ, ప్రాకారో త్సవం, కూష్మాండబళి, పల్లకి సేవ వంటి తదితర పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. చివరగా వేదస్వస్తి, మహా మంగళహారతితో ఉత్సవానికి ముగింపు పలికారు. భక్తులకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో అల్పాహార వితరణ చేపట్టారు. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు డీజే వాయిద్యాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అప్పయ్యదీక్షాపరులు వివిధ దేవతామూర్తుల వేషధారణలతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాతృ, శిశువు మరణాలు జరగకుండా క్రమశిక్షణలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ రాజకుమారి వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మాతృ, శిశువు మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖ ప్రసవములు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గర్భిణి, శిశువు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రోగ్రామ్ అధికార్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికార్లు క్షేత్ర స్థాయి సిబ్బంది విధుల పట్ల సమయపాలన, క్రమశిక్షణతో పనిచేసే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డా.లలిత, ఎంసీహెచ్ నోడల్ అధికారి డా.ప్రసన్న లక్ష్మీ, ప్రోగ్రామ్ అధికారి డా.శ్రీజ, నంద్యాల సర్వజన ఆసుపత్రి గైనిక్ విభాగం డా.సుధారాణి, డా.సలీమున్నీసా, చిన్నపిల్లల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. అరుణజ్యోతి, డా.మాధవి, ఇన్‌చార్జి డెమో మద్దిలేటి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య

నందికొట్కూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలును జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య తనిఖీ చేశారు. న్యాయాధికారి మాట్లాడుతూ న్యాయవాది లేని వారికి ఉచితంగా లోక్ అదాలత్ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. 70 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఎవరైనా ఉన్నారా అని ఆమె ఆరా తీశారు. ఏవైనా సమస్యలుంటే జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా కాని, ఆన్‌లైన్ నెంబరు 15100 ద్వారా గాని తెలియజేయాలని సూచించారు.భోజన వసతులు, వైద్య సదుపా యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ జైలు అధికారి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్

ఆత్మకూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై చురుగ్గా స్పందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇప్పటివరకు పని చేసిన పార్టీ సభ్యులు తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని అన్నారు. సీపీఎం సభ్యులు ప్రజలతో మమేకమైన వారి సమస్యల పరిష్కారం కోసం చురుగ్గా వ్యవహరించాలన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వాలు పని చేసేలా ఒత్తిడి తేవ్వాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, రణధీర్, సుధాకర్, రామ్‌నాయక్, నాగేశ్వరరావు, ఇస్మాయిల్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.


పాణ్యంలో త్రోబాల్ ఆడుతున్న ఉపాధ్యాయురాలు

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

పాణ్యం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయురాలకు త్రోబాల్ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను డివిజన్‌స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కోటయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

మహానంది: మండలం తిమ్మాపురం జడ్పీ పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల క్రీడా పోటీలను ఎంఈఓ విజయకుమార్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి, ఎంపీటీసీ స్వరూపతో పాటు మండల క్రీడా ప్రతినిధి నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు శనివారం ఉపాధ్యాయులకు మండల స్థాయిలో ఆటల పోటీలను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్, పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ క్రీడాపోటీలను ఎంఈవో-1,2లు మార్గరేట్ రాణి, అయూబ్ అహ్మద్‌లు ప్రారంభించారు. మండల స్థాయిలో ఎంపికైన వారిని డివిజన్ స్థాయి ఆతర్వాత జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల్లో పాల్గొంటారని వెల్లడించారు. పోటీలను పీడీలు శంకర్, చంద్రశేఖర్, మురళీనాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.


ఆత్మకూరులో ఉపాధ్యాయుల క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు

రైతు రాజ్యమే టీడీపీ లక్ష్యం

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి
- పరమటూరు గ్రామంలో రైతన్న మీ కోసం


బండిఆత్మకూరు: కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

బండిఆత్మకూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండి రారాజుగా నిలపటమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పరమటూరు గ్రామంలో ఏవో పవన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి, తెలుగుగంగ జిల్లా వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, వడ్డు మధుసూదన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సాయిబాబారెడ్డి, మాధవరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శేఖర్, నాగేశ్వరరెడ్డి, కె.శంకర్, జాకీర్, బాబు తహసీల్దారు పద్మావతమ్మ, ఎంపీడీవో గాయత్రి, ఏఈ లక్ష్మీనరసింహ, డాక్టర్ అనూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గని గ్రామంలో..

గడివేముల: అన్నదాతలకు అండగా టీడీపీ ప్రభుత్వం ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. శనివారం మండలంలోని గని గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రైతులకు ముఖ్యమంత్రి ఇచ్చిన లేఖలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దిలిప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, పాణ్యం మార్కెట్‌యార్డ్ చైర్మన్ అంగజాల గీత, మురళీ మోహన్‌రెడ్డి, హర్షవర్ధన్, ఎంపీడీవో వాసుదేవగుప్త, తహసీల్దార్ వెంకటరమణ, మండల వ్యవయాసాధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రోళ్లపాడు గ్రామంలో..

మిడుతూరు: రైతు శేయస్సు కోరేదే కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం రోళ్లపాడు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలను అందజేశారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


రోళ్లపాడులో రైతన్న మీకోసం కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

మహానంది: రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్ వంగాల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం శ్రీనగరం గ్రామంలో రైతన్న మీ కోసం వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి, ఎంపీపీ యశస్వీని, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, మహానంది ఆలయ పాలకమండలి మాజీ సభ్యుడు గంగిశెట్టి మల్లిఖార్జునరావు, నాయకుడు సుంకులయ్య పాల్గొన్నారు.

అబాండతాండ గ్రామంలో..

నంద్యాల రూరల్: రైతన్నలు ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే అధిక దిగుబడులు సాధించగలరని మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు అన్నారు. శనివారం అబాండ తాండ గ్రామంలో రైతన్న మీకోసం నిర్వహించారు. రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రంగప్రసాద్, రాష్ట్ర లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ బాబు, డైరెక్టర్ స్వామినాయక్, అధికారులు పాల్గొన్నారు.


గడివేముల: నవధాన్యాల కిట్టును అందిస్తున్న ఎమ్మెల్యే

1న జిల్లా స్థాయి క్రీడాపోటీలు

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో డిసెంబరు 1న ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం ఏపీసీ మాట్లాడుతూ నంద్యాల ఎస్పీజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న పోటీల్లో రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావలిన్‌త్రో వంటి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న అండర్-17, అండర్-20 సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పోటీల్లో పాల్గొనాలని కోరారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు


పాల్గొన్న అతిథులు

నంద్యాల ఎడ్యుకేషన్/ నంద్యాల కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రామచంద్ర మిషన్ ఆశ్రమంలో శనివారం కంఠస్థ తాత్పర్య సహిత పోటీలు నిర్వహించారు. రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ కోఆర్డినేటర్ రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా దివిహయగ్రీవాచార్యులు, రిటైర్డ్ న్యాయాధికారి శివప్రసాద్, గీతాలక్ష్మీ, డాక్టర్ రమణమూర్తి, దత్తన్న, రమేష్ వ్యవహరించారు. 1నుంచి 5వ తరగతి విద్యార్థులను జూనియర్ విభాగంగా, 5వ తరగతి నుంచి 10వరకు సీనియర్ విభాగంగా పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు గీతోపదేశం వర్క్‌బుక్‌ను బహుమతిగా అందజేశారు.

శ్రీసంకల్ప్ ఒలింపియాడ్‌లో క్రాఫ్ట్ కార్నివాల్

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ పాఠశాలలో క్రాఫ్ట్ కార్నివాల్‌ను నిర్వహించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొని ప్రతిభను చాటారు. పాఠశాల చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలతో కలిసి వారి తల్లిదండ్రులు గడిపే ఆహ్లాదకరమైన సమయం దొరుకుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరురూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం నంద్యాల జిల్లాకు భారీ వర్ష సూచన ఉందని, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి హేమలత సూచించారు. శనివారం సిద్దపల్లి గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు చేశారు. పంట కోతను రెండు మూడు రోజులు వాయిదా వేసుకోవాలని, కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని సూచించారు.

విద్యార్థుల శ్రమదానం

మహానంది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యార్థులు తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో శ్రమదానం చేశారు. శనివారం కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆసుపత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

మోడల్ స్కూల్‌లో పౌష్టికాహార దినోత్సవం

మిడుతూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జాతీయ పౌష్టిక ఆహార దినోత్సవం ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవోలు ఫైజున్నిసా, మల్లికార్జున నాయక్ హాజరై విద్యార్థులు ప్రదర్శించిన పౌష్టికాహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ రెహమున్నిసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు చేయాలి

మిడుతూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. శనివారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఆపార్టీ నాయకులు గోపాలకృష్ణ, ఓబులేసు బాలిక తల్లిదండ్రులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలికకు మాయమాటలు చెప్పి మోసగించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలనిడిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోపాల వెంకటరమణ, సుధాకర్ నాయుడు, యశోదమ్మ, కేవీపీఎస్ మండల కార్యదర్శి లింగస్వామి పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురు అరెస్ట్

వెలుగోడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. వివరాలు.. స్థానిక ద్వారకనగర్‌కు చెందిన రమణ, వెంకటసుబ్బయ్యలకు చెందిన రెండు పొట్టేళ్లను ఈనెల 23న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. శనివారం నలుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి పొట్టేళ్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మద్దూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు, టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ కో-ఆర్డినేటర్ ప్రసన్న అన్నారు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో కొత్తగా నిర్మించిన శానిటరీ కాంప్లెక్స్‌ల వద్ద ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో తాహిర్‌హుసేన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. మద్దూరు గ్రామంలో హెచ్ఎంలు రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, ఓబన్న, పంచాయతీ కార్యదర్శి చిన్నబ్బి ర్యాలీ నిర్వహించారు.

ఇంటి ఆహారంతోనే ఆరోగ్యం



ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించిన ఎంఈవో

కొలిమిగుండ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంట్లో తయారు చేసుకునే ఆహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని మండల విద్యాధికారి అబ్దుల్ కలాం అన్నారు. శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రత్యేక అధికారి లక్ష్మీ సరోజ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంట్లో తయారు చేసుకునే వివిధ రకాల వంటకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మృతి చెందిన రామలక్ష్మమ్మ

కోవెలకుంట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంపమల్లకు చెందిన సూరా రామలక్ష్మమ్మ శతాధిక వృద్ధురాలు (102) మరణించినట్లు కుమారులు సూరా వెంకట సుబ్బారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె నాలుగు తరాల మనవళ్లను చూసినట్లు పెద్దకుమారుడు తెలిపారు. మరణించేంత వరకు ఆమె దృష్టి లోపం లేదని, ఇప్పటి వరకు జొన్న సంగటి, కూరగాయలు, ఆకుకూరలు ఆహారంగా తీసుకుంటుండేదని తెలిపారు. అనారోగ్యానికి గురై శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అగ్నిమాపక కేంద్రం తనిఖీ

డోన్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజోతి): పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని శనివారం అగ్నిమాపక జిల్లా అధికారి శంకర్ ప్రసాద్ తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది తీరు ను పరిశీలించారు. కార్యక్రమంలో డోన్ అగ్నిమాపక అధికారి రంగస్వామి గౌడు ఉన్నారు.

ఎస్సీ కాలనీలో వీధి లైట్లు

కొలిమిగుండ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీధి లైట్లు ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండల ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి తెలిపారు. శనివారం డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, సర్పంచ్ జినుగు శివరాముడు, ఎస్సీ కాలనీ, కొండాపేట కాలనీలను సందర్శించి వీధిలైట్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా కాలనీల్లో నూతన వెలుగులు సంతరించుకున్నాయి.

భూసార పరీక్షలపై అవగాహన

రుద్రవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో శనివారం భూసార పరీక్షలపై ఏవో సుమతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షతోనే నేల స్వభావం గుర్తించవచ్చని అన్నారు. భూమిలో ఉన్న పోషకాలను వాటి ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మ టెక్నికల్ అధికారి చంద్రశేఖర్‌నాయక్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఏఈవోలు రాజు, తబుస్సుం పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి

చాగలమర్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. శనివారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే చాగలమర్రిలోని గుంతపాలెం వీధిలోని ప్రాథమిక పాఠశాల, గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూ రాధ తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజశేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్, కళావతి, సీఆర్పీ ఖాసీం పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్‌పై ఉత్కంఠ

చాగలమర్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట డెయిరీ సొసైటీకి ఖాళీ ఏర్పడ్డ రెండు డైరెక్టర్ల స్థానానికి శనివారం నామినేషన్ ప్రక్రియ జరగాల్సి ఉంది. నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులు ఎన్నికల అధికారి రాకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. ఉద యం నుంచి మధ్యాహ్నం వరకు సంబంధిత ఎన్నికల అధికారి రాకపోవడంతో నామినేషన్ నిర్వహించలేదు. వాయిదా వేశారా లేక ఏకగ్రీవంగా నిర్వహిస్తారా అన్న ఉత్కంఠ నెలకొంది.

130 శానిటరీ కాంప్లెక్స్‌లు

చాగలమర్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పరిధిలో కొత్తగా 130 శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసన్న తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆమె మాట్లాడుతూ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాల కోసం రూ.39.30 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్, కార్యదర్శి ఆదినారాయణ, ఎంసీవో రాజ్‌కుమార్, షేక్షావలి పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏవో

శిరివెళ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో సుధాకర్ సూచించారు. మండలంలోని వెంకటేశ్వరాపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పత్రాలు పంపిణీ చేశారు. జొన్న, మొక్కజొన్న పంటలతో పాటు వరి పైరును కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

సచివాలయాల్లో అందని సేవలు

- పని వేళలు పాటించని ఉద్యోగులు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి విజిట్

చాగలమర్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో ప్రజలకు సరైన సేవలు అందడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు ఎప్పుడు వస్తారో వెళ్తారో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు మండలంలోని మల్లేవేముల సచివాలయాన్ని 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ఆయా శాఖల ఉద్యోగులు లేకపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించాయి. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు అధికారులు లేక వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సచివాలయంలో ఆరుగురు విధులు నిర్వహిస్తుండగా కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే విధులకు వచ్చారు. ఇంజనీరింగ్ సహాయకుల పోస్టు ఖాళీగా ఉంది. సచివాలయం పరిధిలో కలుగొట్లపల్లె, గొట్లూరు, నగల్లపాడు, రాజోలి గ్రామాల ప్రజలు ఈ సచివాలయంలోనే సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగులు సమయ పాలన పాటించేలా చూడాలని కోరుతున్నారు.



మల్లేవేముల సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

నీటి సమస్య పరిష్కారానికి కృషి

- కలెక్టర్ రాజకుమారి
- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కోట్ల
- తుమ్మల చెరువుకు జలహారతి

డోన్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డితో కలిసి హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా నీటితో నింపిన డోన్, ప్యాపిలి మండలాల్లోని అభిరెడ్డిపల్లె, వెంగలాంపల్లి, పీఆర్‌పల్లి, గుడిపాడు, చంద్రపల్లి, హుశేనాపురం గ్రామాలకు సంబంధించిన చెరువులు, ట్యాంకులను పరిశీలించారు. అనంతరం డోన్ మండలంలోని వెంకటాపురం తుమ్మల చెరువు వద్ద వారు జలహారతి ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 68 చెరువులుండగా అందులో నంద్యాల జిల్లాకు చెందిన 35 చెరువుల్లో 7 చెరు వులకు హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా నీరు అందకపోవడంతో తాను ప్రత్యక్షంగా పరిశీలన చేపట్టినట్లు వివరించారు. మండలాల వారీగా చెరువుల నింపుదల, వాటికి నీటి సరఫరా పరిస్థితులపై మైనర్ ఇరిగేషన్ అధికా రులతో సమీక్షించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. రైతులకు సాగునీరు సక్రమంగా అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చెరువుల చుట్టుపక్కల పెరిగిన ముళ్లకంపల తొలగింపునకు చర్యలు తీసు కుంటామన్నారు.



చెరువుకు జలహారతి ఇస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే కోట్ల

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కోట్ల

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. పంటలకు సకాలంలో నీరందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడు, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్ డీఈలు రమేష్ రెడ్డి, సురేష్, ఏఈలు హరికృష్ణ, నారాయణ, కేడీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్ర గౌడు, గోవిందు, చిన్నమల్కాపురం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



సీఎం చంద్రబాబు, మంత్రి బీసీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ దూదేకుల (నూర్ బాషా) కో-ఆపరేటివ్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై సంఘం రాష్ట్ర డైరెక్టర్, బనగానపల్లె పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ ఖాసీం సాహెబ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా మహబూబ్ ఖాశీం సాహెబ్ మాట్లాడుతూ దూదేకుల కులస్థులకు కార్పొరే షన్ ఏర్పాటు చేస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు దూదేకుల సమాజం తరపున ధన్య వాదాలు తెలిపారు. ఇందుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యా ణ్, మంత్రులు నారాలోకేశ్, బీసీ జనార్దన్‌రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ నాగూర్ మీరాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు అవుకు తిక్కన్న, యాగం టిపల్లె దస్తగిరి, బనగానపల్లె మౌలాలి, మదార్‌బాషా, ఆకుల దస్తగిరి, సంగంషాప్ బాషా, హుసేన్‌వలి, గోల్డ్ షాపు దస్తగిరి, హుసేన్‌సా, వెంకటాపురం ఖాశీం, తిరుపతయ్య పాల్గొన్నారు.

మంత్రి బీసీకి ధన్యవాదాలు

కోవెలకుంట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లెను రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేసిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి కోవెలకుంట్ల డీలర్ల సంఘం కన్వీనరు వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి, వెలగటూరు టీడీపీ నాయకులు ధనుంజయుడు, పుల్లారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. శనివారం పట్టణంలోని సివిల్ సప్లై గోడౌనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి బీసీ మండల ప్రజల కష్టాలను గుర్తించి సీఎం చంద్రబాబుతో మాట్లాడి బనగానపల్లె రెవెన్యూ డివిజనుగా ఏర్పాటుకు కృషి చేశారన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు డిసెంబరు 9వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లలిత శనివారం తెలిపారు. సెక్యూరిటీ అనలిస్టు, ఆటోమోటివ్, అప్లికేషన్ స్పెష లిస్టు కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. డిప్లొమా, డిగ్రీ బీటెక్ (ఆటోమోటివ్, ఈఈఈ, మెకానికల్) ఎంటెక్ కంప్యూటర్ కోర్సులు చదివిన వారు అర్హులని, వివరాలకు 9705998056 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శిరివెళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని సర్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు వచ్చారు. ప్రకాశంజిల్లా గిద్దలూరు మండలం బయనపల్లి గ్రామానికి చెందిన ఓబులేసు, బాల ఓబయ్య కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళాన్ని ఆలయ ఈవో సాయి జయచంద్రారెడ్డికి అందజేశారు. అనంతరం వారు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

విద్యార్థినికి అభినందన



సుసన్నను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో డోన్ పట్టణానికి చెందిన మున్సిపల్ మేస్త్రీ పి.దేవదానం, పి.వరలక్ష్మి దంపతుల కుమార్తె పి.సుసన్న పాల్గొంది. సుసన్న డోన్ పట్టణం సమీపంలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వరప్రసాద్ సుసన్నను అభినందించారు. అలాగే అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఈ గీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సుసన్నను శాలువతో సత్కరించారు.

మంగపల్లెలో నేడు వైద్య శిబిరం

సంజామల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగప ల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు గురురాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శనివారం తెలిపారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, కీళ్లనొప్పులు, దంత, చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీ వ్యాధులకు సం బంధించి కర్నూలు, నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజే స్తానన్నారు. ఈ అవకాశాన్ని కోవెలకుంట్ల, సంజామల మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలి



ఇండస్ట్రీ విలేజ్‌కు వెళ్తున్న విద్యార్థులు

దొర్నిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం చెన్నకేశ్వరి అన్నారు. శనివారం దొర్నిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇండస్ట్రీ విజిట్‌లో భాగంగా డీవీఆర్ మెన్స్ గార్మెంట్స్ తయారీ కేంద్రానికి విద్యా ర్థులను తీసుకెళ్లినట్లు ఒకేషనల్ ఉపాధ్యాయుడు కంబగిరి రాముడు తెలి పారు. విద్యార్థులకు బ్యాగుల తయారీపై స్టిచ్చింగ్, కటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఐవీ రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ఆంధ్రా బ్యాంక్ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ గరీబ్‌షావలి దర్గా ఉరుసు ఉత్సవాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం గంధం, డిసెంబరు 1న ఉరుసు ఉత్సవాలు, 2న జియారత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ క్రీడా పోటీలు ప్రారంభం

డోన్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజోతి): పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మండల ఉపాధ్యాయ క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారులు ప్రభాకర్, రఘునాయక్‌లు క్రీడలను ప్రారంభించారు. మండలంలోని 60 మంది ఉపాధ్యాయులు ఈ క్రీడలకు హాజరయ్యారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ క్రీడలు నిర్వహించగా.. వీటిలో ఎంపికైన ఉపాధ్యాయులకు డిసెంబరు 13, 14 తేదీల్లో జరిగే డోన్ డివిజన్ స్థాయి ఆటల పోటీలకు పాల్గొనాల్సి ఉంటుందని ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు రామనరసప్ప, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం షైముస్నీసా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో..

అవుకు: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు డిసెంబరు 2న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీధర్‌రావు శనివారం తెలిపారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో ప్రభాకర్

12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు ప్రతాప్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సత్యప్రకాశ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనులు అప్పగించరాదని డిమాండ్ చేశారు. పదో తరగతి వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో ఆదివారం తరగతులు లేకుండా విద్యార్థులకు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, విజయకుమార్, సుంకన్న, మనోహర నాగరాజు పాల్గొన్నారు.

'సంఘటన్' జయప్రదం చేయాలి

డోన్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజోతి): డోన్‌లో డిసెంబరు 1వ తేదీన చేపట్టే సంఘటన్ సృజన్ అభియాన్ (సంస్థాగత నిర్మాణ కార్యక్రమం)ను జయప్రదం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వ యకర్త గార్లపాటి మద్దిలేటి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డిసెంబరు 1న డోన్‌లో జరగబోయే సంస్థాగత నిర్మాణ కార్యక్రమానికి బెంగళూరు శాంతినగర్‌కు చెందిన ఎమ్మెల్యే అహ్మద్ హారీస్, కాంగ్రెస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ హాజరవుతా రన్నారు. కాంగ్రెస్ నంద్యాల డీసీసీ ఉపాధ్యక్షులు ఉన్నిగొర్ల జనార్దన్, పార్టీ డోన్, బేతంచెర్ల, ప్యాపిలి, మండలాల అధ్యక్షులు పటాన్ మహబూబ్ హుశేన్, రామాంజనేయులు, మహేంద్ర నాయుడు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థికసాయం

డోన్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న చిన్నారికి డోన్ స్ఫూర్తి సేవా సమితి ఆర్థిక సాయం అందించి ఆదుకుంది. డోన్ పట్టణానికి చెందిన చాకలి ఈరమ్మ కూతురు వైష్ణవి(7) గత కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధ పడుతోంది. కూతురు వైద్యానికి సాయం చేయాలని సోషల్ మీడియాలో తల్లి పోస్ట్ చేసింది. దీనిని గుర్తించిన స్ఫూర్తి సేవా సమితి స్పందించింది. దాతల ద్వారా వచ్చిన రూ.25 వేల ఆర్థిక నగదును, ఒక బియ్యం సంచిని శనివారం వైష్ణవి తల్లి ఈరమ్మకు అందించారు. సంస్థ అధ్యక్షుడు మధు, అలా కృష్ణవేణి, కర్నూలు శివ చౌదరి, న్యాయవాది కాలిక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షురాలిగా భాను

బేతంచెర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా కటిక భాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి తెలిపారు. శనివారం రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ తీర్మాణం మేరకు భానును జిల్లా అధ్యక్షురాలిగా ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్ఐ

కోవెలకుంట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జున రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ముక్కర జయరామిరెడ్డి ఫంక్షన్ వద్ద ఎస్ఐ వాహనాలను తనిఖీ చేసి, సర్టిఫికెట్లు, లైసెన్సులు లేని వాహనాలపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు.

బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారిగా మునిరాజు

డోన్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డోన్ బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారిగా డి.మునిరాజు నియమితులయ్యారు. శనివారం మునిరాజుకు పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రక్తదానం చేసి.. ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న ఆలయ ఈవో రామాంజనేయులు

బేతంచెర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మద్దిలేటి స్వామి క్షేత్రం ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఈవో ఆధ్వర్యంలో ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 52 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నంద్యాల రక్త కేంద్రం మేనేజర్ అచ్యుత్, సిబ్బంది ఉన్నారు.

పుస్తక పఠనం చేయాలి



పుస్తక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రుద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పుస్తక పఠనం చేయాలని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం ఆదర్శ పాఠశాలలో ఓపెన్ లైబ్రరీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుస్తకం మంచి స్నేహితుడుగా పని చేస్తుందన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కోవెలకుంట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో కోవెలకుంట్లలోని స్వామినగర్, సంతపేటలో కేవలం నెలరోజుల వ్యవధిలోనే విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేశారు. గత నెల 30న మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటిస్తున్న సమయంలో పట్టణంలోని స్వామినగర్, సంతపేట వాసులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. విద్యుత్ స్తంభాలు ఒరిగాయని, విద్యుత్ తీగలు ఇళ్లపైకి వాలి ప్రమాదకరంగా మారాయని మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి సమస్య వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం స్వామినగర్‌లో రూ.6లక్షలు, సంతపేటల రూ.3లక్షలతో మొత్తం 9 లక్షలు విలువైన 28 నూతన విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేశారు.

స్వామిత్వ గ్రామసభలు

దొర్నిపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకరాజువేముల గ్రామంలో ఈవోపీఆర్డీ శివప్రసాద్ ఆధ్వర్యంలో స్వామిత్వ గ్రామ సభ నిర్వహించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లు, ఖాళీ స్థలాలు, కలాలు కొలతలు వేసి అనంతరం భూమి పత్రాలు సంబంధిత రైతులకు అందిస్తామన్నారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకట్‌నాయుడు, ఆలయ ధర్మకర్త గోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం

రుద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. శనివారం సీసీ రోడ్డు పనులను టీడీపీ నాయకులు శ్రీను, మాజీ ఎంపీటీసీ బలరామిరెడ్డి, గుర్రం ఫకీరాలు పరిశీలించారు. పీఆర్ ఏఈ కమాల్‌సాబ్ పాల్గొన్నారు.